# ఆకాశం
# కోల్పోయిన
# పక్షి

కృష్ణుడు

ఎమెస్కో



# గమనం


కృతజ్ఞతలు vii
పహారా ix
ఏమైనా మారిందా? xxix
ఆకాశం కోల్పోయిన పక్షి 1
ఊరుకోలేను 3
యాభై ఏళ్లు 5
ఆమె 9
ఆ శవం నాదే! 12
ఆహ్వానం 17
అమ్మా.. 19
అంతా క్షేమమే.. 28
అర్థం కాలేదు.. 33
అస్వచ్ఛ భారత్ 35
అతడే 39
బేగం! 42
బిందువు 44
చెట్టు 46
ఏడాదికొక రోజు.. 48
ఎక్కడ? 51
ఏం రాయను? 53
జ్ఞాపకాలు 59
హరహర.. 61
కళ్లకు చావు లేదు 63
ఖాన్, మేరా అబ్బాజాన్! 66
మూర్ఖత్వం 73
మృత్యుకేళి 75
నగరంలో అమావాస్య 78
నాన్నలో నేను.. 83
నీ కోసం.. 86
నీకు ఇష్టం లేకపోయినా 88
నీకు తెలుసు 90
నీవు లేవు 92

| | |
|---|---|
| నేనే నీ వెంట.. | 94 |
| ఆపరేషన్ | 97 |
| పక్షులు లేని ఆకాశం | 100 |
| పూనకం | 104 |
| ప్రకంపనం | 107 |
| ప్రశాంతం | 109 |
| ప్రశ్న.. | 112 |
| రా... | 114 |
| రానీ.. రానీ.. | 117 |
| శిథిల నగరం | 122 |
| తారా! | 124 |
| వాడు రానీ.. | 127 |
| ఆమె పేరే ఆమె శ్వాస | 134 |
| మార్పు | 137 |
| రెప్పల వెనుక ప్రయాణం | 139 |
| నేను లేను.. | 141 |
| ఆమె ఎవరో తెలియదు | 144 |
| మృత్యుస్పర్శ | 147 |
| ఆ నలుగురూ | 156 |
| పథకం | 158 |
| కవి జన్మించిన రోజు | 160 |
| రాలిన మేఘం... | 162 |
| రేపు... | 164 |

# ఆకాశం కోల్పోయిన పక్షి

చేతి వ్రేళ్లు
తగలని పుస్తకంలా
కొట్టుకుంటున్న
జీవితం

పరుగెడుతున్నారు
మనుషులు
వాహనాల్లా
ఒక మాటా లేదు
ముచ్చటా లేదు

మనసు తన్లాడుతోంది
ఒక చిరునవ్వు
పలకరింపుకోసం

శాసిస్తున్నాయి
గడియారపు ముళ్లు
కలలనూ, ఆలోచనలనూ

కరచాలనానికి
చేయిజాపే లోపే
మాయమైన మనిషి

ఇక్కడిక్కడే అందరూ
సమీపంలో ఉన్నదేదీ
సన్నిహితం కాదు
పెరుగుతోంది దూరం
దగ్గరవుతున్నకొద్దీ

మనిషిని పోల్చుకోవడం కష్టం
వాహనాలు, భవంతులూ,
లైట్లూ రహదారుల మధ్య

రేపటి ప్రతిధ్వనులు కాలేవు
నిన్నటి నినాదాలూ సభలూ..

పాడుబడిన గోడల మధ్య
మొలిచిన మొక్కే
నేటి సజీవ దృశ్యం

పక్షి ఆకాశం కోల్పోయింది
నగరం చైతన్యాన్ని కోల్పోయింది

**(28-8-2015)**



# ఊరుకోలేను

అక్షరాలు గుండెల్లో
దూసుకుపోయి చాలాకాలమైంది
రాసిరాసి చేతులు
సడలిపోయాయేమో కానీ
పదాలు మనసును కదల్చి
చాలా కాలమైంది

పూలు
పరిమళాల్ని అందించడం లేదు
నివాళుల్ని గుర్తు చేయడం తప్ప

మట్టి వాసన ఎలా ఆఘ్రాణించగలను
ఇంకిన నెత్తురు
పాదాలకు తగులుతుంటే?
శరీరం ఒక ఝరి అయి
హోరెత్తి గానం చేసిన వాడిని

నాలుగు గోడల మధ్య
నన్ను నేను బంధించుకుని
విషాద గీతం ఎలా రాస్తా?

కరచాలనాలను
గుర్తు చేసే కర పత్రాలు

సమాధుల చిరునవ్వును
భరించలేను

అలంకరణలు కోరికలను
రగిల్చి చాలా కాలమైంది

బూడిదను నుదుటిపై
అలముకొన్నవాడిని
దావానలాల్ని చూసి
చాలా కాలమైంది

**(11-8-2016)**



# యాభై ఏళ్లు

సగం రాత్రి గడిచిపోయింది
సగం పగలూ వెళ్లిపోయింది
సగమో కాదో ఎలా చెప్పగలను?
రెప్ప తెరుచుకుంది
తల తడిపిన వర్షం
ఆగిపోయింది
దోసిలిలోంచి
ఇసుక జారిపోయింది,
దాహం తీరకముందే
నీరు ఇంకిపోయింది

కందీళ్ల వెలుగుముందు
కళ్లు తడిమిన అక్షరాలు
కావాలిప్పుడు
ముళ్ల డొంకల్లో
చెప్పుల్లేని కాళ్లతో

బుడి బుడి నడకలు ఏవీ?
ఆచార్య సార్
బొమ్మ సంతకం పెట్టండి
ఒక్కో గాయం
వెనుక ఒక్కో జ్ఞాపకం

పూల్ బాగ్ గుడిలో
వేడి ప్రసాదం కోసం
నాకర్థం కానివేవో చదివా
లైబ్రరీలో బాలభాను
లిఖిత మాసపత్రిక ఎక్కడుందో కదా
కాల్వగడ్డ, మేతర్‌వాడి
ప్రక్కింటి సీను, కటిక రమేశ్ ఏరీ?

కడుపులో రేగిన బడబానలానికి
కొత్త అర్థం చెప్పింది ఓరుగల్లు
సాహిత్యానికి కొత్త ఒరవడి దిద్దింది
తలెత్తడం నేర్పిన రహదారుల్లో
జీవితానికి మరో కోణం తెలిసింది

అమ్మా,
నీ బోసి మెడ
మా ఆకలి తీర్చే ప్రయత్నానికి చిహ్నం
నెత్తురు చిందేలా
ఆ ముక్కు పోగు ఎందుకు తీయాలనుకున్నావు?
బాధలు, అవమానాలే నీకు ఆభరణాలు
ఎందుకోసమమ్మా ఆ తాపత్రయం?